# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- లోక్‌సభ రెండవ దశ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలుకు ఈ రోజుతో గడువు ముగిసింది.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర తిరుపతి జిల్లాలో కొనసాగుతోంది.
- వేసవి సాగునీటి అవసరాల కోసం ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు.
- రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.
- మే 10వ తేదీన సింహాచలంలో చందనోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

========================

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రెండవ దశ ఎన్నికల కోసం నామినేషన్ల దాఖలుకు గడువు ఈ రోజుతో ముగిసింది. రెండవ దశలో కేరళలో 20 స్థానాలు, కర్ణాటకలో 14 స్థానాలు, రాజస్థాన్‌లో 13 స్థానాలు, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో 8 స్థానాలు, మధ్యప్రదేశ్‌లో 7 స్థానాలు, అస్సాం, బీహార్‌లో 5 స్థానాలు, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌ఘఢ్‌లో 3 స్థానాలు, మణిపూర్, త్రిపుర, జమ్మూ కాశ్మీర్‌లలో ఒక్కో స్థానానికి ఎన్నికలు జరగనున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. కాగా రెండవ విడత పోలింగ్ ఈ నెల 26న జరగనుంది.

========================

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే టిప్పర్ లారీ డ్రైవర్లకు కూడా వాహన మిత్ర పథకాన్ని అమలు చేస్తామని ఆ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. తిరుపతిలో "మేమంతా సిద్ధం" కార్యక్రమంలో

భాగంగా నిర్వహిస్తున్న బస్సు యాత్రలో ఆయన ఈ రోజు సింగనమలలో డ్రైవర్లతో "ముఖా-ముఖీ" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదానికి గురి అయిన డ్రైవర్లకు బీమా సాయాన్ని కల్పిస్తామని అన్నారు. బస్సు యాత్రలో భాగంగా నాయుడుపేటలో జరిగిన బహిరంగసభలో వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రసంగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వేసవి తాగునీటి అవసరాల దృష్ట్యా ఈనెల 6వ తేదీన ప్రకాశం బ్యారేజి నుండి ఏలూరు కాలువ, బందరు కాలువ, రైవస్ కాలువల ద్వారా ఎన్టిఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లకు, బకింగ్ హాం కాలువ ద్వారా గుంటూరు, బాపట్ల జిల్లాలకు నీటిని విడుదల చేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి చెప్పారు. అలాగే నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు ఈనెల 8 నుండి 18వ తేదీ వరకూ 10 రోజుల పాటు నీటిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులు, ఉపాధి హామీ పథకం పనులపై ఈరోజు వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పధకం అమలు తీరును సమీక్షిస్తూ వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలెవరు వడదెబ్బకు లోను కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. రాయలసీమ జిల్లాల్లో 40 డిగ్రీల సెల్సియస్ కు మించి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రానున్న మూడు రోజు ల్లో రాష్ట్రంలో పలు జిల్లాలలో వడ గాలులు వీచే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా జిల్లాల్లో పాటు రాయల సీమ జిల్లాలలో వడగాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముందని పేర్కొంది. ఇదిలా ఉండగా ఈ రోజు రేపు పార్వతీపురం మన్యం జిల్లాలో తీవ్రవడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలియజేసింది. దీంతో పాటు రాష్ట్రంలోని 130 మండలాల్లో వడగాల్పులు వీస్తాయని తెలిపింది. వీలైనంత వరకు బయటకు రాకుండా ప్రజలు ఇంట్లోనే ఉండాలని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి చందనోత్సవాన్ని మే నెల 10వ తేదీన నిర్వహించనున్నట్లుగా ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసమూర్తి ఈరోజు తెలిపారు. స్వామి వారు నిజరూప దర్శనంతో భక్తులకు కనిపిస్తారని పేర్కొన్నారు. ఘనంగా చందనోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. అదే విధంగా ఈ నెల 19న స్వామి వారి వార్షిక కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లుగా తెలిపారు. ఈ ఉత్సవాల నేపధ్యంలో చేయవలసిన ఏర్పాట్లను ఆలయ ఈవో పర్యవేక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో శ్రీకాకుళం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి.ఆర్. రాధిక ఆదేశాలతో శ్రీకాకుళం పట్టణంలో కేంద్ర పోలీసు బలగాలు, స్థానిక పోలీసు సిబ్బంది ఈరోజు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లుగా పోలీసు అధికారులు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశ అభివృద్ధి కోసం తమ ఓటును వినియోగించుకుంటామని అనంతపురం జిల్లాకు చెందిన యువ ఓటర్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కు వినియోగంపై వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి భరత్ సాయివర్ధన్ ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత దేశం 2047 నాటికి ప్రపంచ స్థాయిలో అత్యాధునిక ఆయుధాలను అభివృద్ధి చేస్తుందని రక్షణ శాఖ కార్యదర్శి డాక్టర్ సమీర్ వి కామత్ తెలిపారు. విశాఖలోని నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లాబొరేటరీ (NSTL)లో DRDO యువ శాస్త్రవేత్తల సదస్సు 2024 10వ ఎడిషన్ ను ఆయన ఈ రోజు ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా వున్న DRDO లేబొరేటరీల నుంచి పాల్గొన్న 160 మంది యువ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, మారుతున్న ప్రపంచ ప్రాధాన్యతలు, సాంకేతికత అవసరాలు DRDOను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. అత్యుత్తమ శ్రేణి రక్షణ వ్యవస్థలను దేశం అభివృద్ధి చేస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. DRDO డైరెక్టర్ జనరల్ (NSM) డాక్టర్ వై.శ్రీనివాసరావు తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో పలు రైళ్ల సర్వీసులను పొడిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ మీదుగా నడిచే హిసార్, తిరుపతి స్పెషల్ రైళ్లను పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. విజయవాడ, ఉజ్జయినితో పాటు ప్రధాన స్టేషన్లలో ఆగే ప్రత్యేక రైళ్లను పొడిగించినట్లు తెలిపింది. హౌరా - యశ్వంత్ పూర్ మధ్య వారంలో ఒకరోజు ఏసీ ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

డీఆర్డీవో సహకారంతో భారత సైన్యం అగ్ని ప్రైమ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ క్షిపణిని పరీక్షించినట్లు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ (SFC), డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ తో కలిసి కొత్త తరం మిస్సైల్‌ను పరీక్షించగా నిర్దేశిత అన్ని లక్ష్యాలను తాకిందని పేర్కొంది. ఈ క్షిపణి అణ్వాయుధాలను సైతం మోసుకెళ్లగలదని అధికారులు తెలిపారు. కాగా, అగ్ని ప్రైమ్ క్షిపణి పరీక్ష విజయవం కావడంపై రక్షణ మంత్రి, బీజేపీ నేత రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్ర ప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యులుగా ముగ్గురు ప్రమాణ స్వీకారం చేశారు. గొల్ల బాబూరావు, వై.వీ.సుబ్బారెడ్డి, మేడా రఘునాథ రెడ్డిలతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేయించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఈ ముగ్గురూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గొల్ల బాబూరావు విలేకరులతో మాట్లాడుతూ, పేదల సమస్యలను రాజ్యసభలో ప్రస్థావిస్తానని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీన ఉగాది ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని ఈరోజు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామివారికి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రసార మధ్యమాలలో ప్రచారానికి ముందస్తు అనుమతి పొందాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, సాలూరు రిటర్నింగ్ అధికారి సి.విష్ణు చరణ్ అన్నారు. సాలూరు పట్టణ పరిధిలో పలు పోలింగ్ కేంద్రాలను ఈరోజు ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అనుమతుల కోసం "సువిధా" యాప్ లో కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెయిడ్ న్యూస్ ను మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. పోలింగ్ రోజున, పోలింగ్ ముందు రోజున ప్రింట్ మీడియాలో ప్రచురించే ప్రకటనలకు అనుమతులు అవసరమని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =